క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని పలు డివిజన్లలో మంత్రి సబితారెడ్డి శనివారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించున్నట్లు బీఆర్‌ఎస్‌ కార్పొరేషన్‌ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా డివిజన్ల ప్రజలు, కాలనీవాసులు, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్‌: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాయికాలనీ ఫీడర్‌ పరిధిలోని కాలనీలలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, 11కేవీ బీరప్పకాలనీ, ఆర్‌.కె.పురం, అల్కాపురి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10నుంచి 11గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

రాజరాజేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. శివుడికి పూలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. పవిత్ర శుక్రవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్‌ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్‌, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గణేశ్‌ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: ఎన్జీవోస్‌ కాలనీలోని శ్రీ గణేశ్‌ ఆలయంలో 25వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 13 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ సేవా సమితి అధ్యక్షుడు కె.ధర్మారావు గుప్తా, ప్రధాన కార్యదర్శి పీవీకే సోమయాజులు తెలిపారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

'భగీరథ' పైప్‌లైన్‌ వేయండి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌, నాయకులు

కడ్తాల్‌: మండల పరిధిలో రేఖ్యానాయక్‌ తండా నుంచి రావిచేడ్‌ గ్రామం వరకు మిషన్‌ భగీరథ ప్రత్యేక పైప్‌లైన్‌ వేయాలని ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సీఈ రాజేశ్వర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉప సర్పంచ్‌ వెంకటేశ్‌, నాయకులు రమేశ్‌యాదవ్‌, పవన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

యూత్‌ కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడిగా నరేశ్‌

అబ్దుల్లాపూర్‌మెట్‌: యువజన కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడిగా పెద్దఅంబర్‌పేట గ్రామానికి చెందిన పండుగల నరేశ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం రాత్రి నియామక ఉత్తర్వులను జారీ అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్‌ మాట్లాడుతూ మున్సిపల్‌ పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన 8వ వార్డు కౌన్సిలర్‌ పండుగుల జయశ్రీరాజు, కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్‌ కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ పోలీస్‌ అరెస్టు

హస్తినాపురం: వనస్థలిపురం పీఎస్‌లో రైటర్‌నని చెప్పి బెదిరింపులకు పాల్పడిన నకిలీ పోలీసును పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం... గణేశ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్‌యాదవ్‌ తన పాన్‌ నంబర్‌కు ఆధార్‌ను చింతలకుంటలోని మధుబాబుకు చెందిన మీసేవ కేంద్రంలో లింకు చేయించుకున్నాడు. అందుకు రూ.1000 చెల్లించాల్సి ఉండగా వెంకటేశ్‌ యాదవ్‌ డబ్బులు ఇవ్వలేదు. దీంతో తరచూ మధుబాబు వెంకటేశ్‌కు ఫోన్‌ చేసి డబ్బులు అడుగుతుండేవాడు. హయత్‌నగర్‌లో నివాసం ఉండే వెంకటేశ్‌యాదవ్‌ అల్లుడు బొల్లబోయిన మనోజ్‌కుమార్‌ మీసేవ నిర్వాహకుడు మధుబాబుకు ఫోన్‌చేసి '' నేను వనస్థలిపురం పీఎస్‌లో రైటర్‌గా పనిచేస్తున్నా. నువ్వు మా మామ వెంకటేష్‌యాదవ్‌కు పదేపదే ఫోన్‌ చేసి డబ్బులు అడుగుతున్నావంట. మమ్మల్నే పైసలు అడుగుతావా' 'అని దుర్భాషలాడి చంపుతానని బెదిరించాడు. దీంతో మధుబాబు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నకిలీ పోలీస్‌ అని తేలింది. నిందితుడు సొనాట అనే ప్రైవేట్‌ కంపెనీలో పని చేస్తున్నట్లు తేలింది. మనోజ్‌కుమార్‌ అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పార్కింగ్‌ అడ్డాగా ప్రధాన రహదారి



జనప్రియ మహానగర్‌లో రోడ్డుపై పార్కింగ్‌ చేసిన వాహనాలు



కాలనీలోకి వచ్చే ప్రధాన రహదారి దుస్థితి

రోడ్డు అభివృద్ధిని పట్టించుకోక పోవడంతో వాహనాల పార్కింగ్‌ అడ్డాగా మారింది. వర్షాలకు వరదనీరు ముంచెత్తి రోడ్లు ధ్వంసమయ్యాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా.. తదనంతరం అభివృద్ధి పనుల కోసం తవ్వి వదిలేశారు. ఏడాది గడిచినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు తమ కార్లను, బైక్‌లు పార్క్‌ చేస్తున్నారు.

- గుంతలమయంగా మారిన రోడ్డు
- ఏడాది గడిచినా పట్టించుకోని పాలకులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనప్రియ మహానగర్‌ కాలనీవాసులు

మీర్‌పేట: కార్పొరేషన్‌ పరిధిలోని జనప్రియ మహానగర్‌ అపార్ట్‌మెంట్స్‌ అతిపెద్ద గేటెడ్‌ కమ్యూనిటీ. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు జనప్రియ మహానగర్‌ను వరదనీరు ముంచెత్తడంతో ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా.. ఆ తరువాత ట్రంక్‌లైన్‌ పనుల్లో భాగంగా కాలనీ నుంచి లైన్‌ వేశారు. దీంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ట్రంక్‌లైన్‌ పనులు పూర్తయ్యాక తిరిగి రోడ్డు అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్పి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు పట్టించుకున్న వారే లేరు. అధికారులకు ఫిర్యాదు చేస్తే ట్రంక్‌లైన్‌ పనులు హెచ్‌ఎండీఏ వారు చేపట్టినందున వారే అభివృద్ధి చేస్తారని అధికారులు చెబుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు.

ఇబ్బందిగా మారిన ప్రయాణం

రహదారి పూర్తిగా ధ్వంసమవ్వడంతో చేసేది లేక ఒకే వైపు వాహనాల రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నామని స్థానిక కాలనీవాసులు తెలిపారు. రహదారిని అభివృద్ధి చేయకుండా అలాగే వదిలేయడంతో వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయిందని స్థానికులు చెప్పారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోతే రహదారి శాశ్వతంగా పార్కింగ్‌కే పరిమితం కావాల్సి వస్తుందేమోనని అంటున్నారు. కాలనీలోకి వచ్చే ప్రధాన రహదారి పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైందని, గుంతలు, రాళ్లు తేలి ఇబ్బందికరంగా మారిందని కాలనీవాసులు వాపోయారు. మహానగర్‌లో ప్రధాన రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిస్వార్థ సేవకు ప్రతిరూపం నర్సులు

- లయన్స్‌క్లబ్‌ జిల్లా వైస్‌ గవర్నర్‌ డాక్టర్‌ జి.మహేంద్రకుమార్‌రెడ్డి
- వారి సహకారంతోనే ఆస్పత్రుల నిర్వహణ: డాక్టర్‌ రాధిక



కందుకూరు పీహెచ్‌సీలో నర్సులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్‌ సభ్యులు

కందుకూరు: రోగులకు సేవలు అందించడంలో నర్సుల పాత్ర ప్రాముఖ్యమైనదని లయన్స్‌క్లబ్‌ జిల్లా వైస్‌ గవర్నర్‌ డాక్టర్‌ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పీహెచ్‌సీలోని నర్సులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిస్వార్థ సేవకు ప్రతిరూపం నర్సులన్నారు. ప్రాథమిక వైద్యంలో, దీర్ఘకాలిక వ్యాధులతో సపర్యలు చేస్తూ మానవాళి ఆరోగ్యానికి భరోసా కల్పించడంలో నర్సుల పాత్ర అమోఘమైనదని కొనియాడారు. మండల వైద్యాధికారిణి డాక్టర్‌ రాధిక మాట్లాడుతూ.. నర్సుల సహకారం లేకపోతే ఆస్పత్రుల నిర్వహణ కష్టతరమన్నారు. లయన్స్‌క్లబ్‌ వారు నర్సుల సేవలను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ సభ్యుడు కె.వెంకటేశ్వర్లుగుప్తా, హ్యూమన్‌రైట్స్‌ అసోసియేషన్‌ నిర్వాహకుడు తమ్మలి ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి రూ.62లక్షలు



నబీల్‌ కాలనీలో పర్యటిస్తున్న కౌన్సిలర్‌ అహ్మద్‌ కసాది

కౌన్సిలర్‌ అహ్మద్‌ కసాది

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబీల్‌ కాలనీలో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరిస్తామని 3వ వార్డు కౌన్సిలర్‌ అహ్మద్‌ కసాది అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీఈ వెంకన్నతో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం కౌన్సిలర్‌ మాట్లాడుతూ.. వర్షపు నీరు, మురుగు వెళ్లేందుకు సరైన మార్గం లేక కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయాన్ని కౌన్సిల్‌ సమావేశంలో ప్రస్తావించడంతో రూ.62లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పనులు పూర్తైతే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధి పనులకు అడిగనవెంటనే నిధులు కేటాయిస్తున్న మంత్రి సబితారెడ్డి, చైర్మన్‌ అబ్దుల్లా సాధిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నూతన వధువులకు వివాహ కానుక



పెళ్లి కానుక అందజేస్తున్న సత్యం

ఆమనగల్లు: మండల పరిధిలోని శెట్టిపల్లిలో సర్పంచ్‌ ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు రూ.10,116 చొప్పున నూతన వధువులు పూజిత, వాసవికి అందజేశారు. వీరు సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ప్రతీ నూతన వధువుకు ఈ పెళ్లి కానుక అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు వధువుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, పర్వతాలు, గణేశ్‌, రాములు, నర్సింహ, జంగయ్య, వెంకటేశ్‌, కృష్ణయ్య, వీరయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుగౌడ్‌



ఆమనగల్లు: పట్టణంలో శుక్రవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్‌ అధ్యక్షుడిగా మాడ్గుల మండలం సుద్దపల్లి సర్పంచ్‌ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్‌, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా కొర్పి వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పీఆర్వోగా పాష ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. క్లబ్‌ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ మాజీ గవర్నర్‌లు చెన్నకిషన్‌రెడ్డి, జూలూరి రమేశ్‌ బాబు, సందడి నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్‌ హాస్పిటల్‌ చైర్మన్‌ డాక్టర్‌ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు రూ.10వేల ప్రోత్సాహం



నగదు అందజేస్తున్న ఫౌండేషన్‌ సభ్యులు

తలకొండపల్లి: అంతరించిపోతున్న కళలను ఆదరించాలని ఐక్యతా ఫౌండేషన్‌ చైర్మన్‌ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కళలను ప్రోత్సహించేందుకు ఫౌండేషన్‌ నుంచి ఆర్థికసాయం అందజేసి కళాకారులకు సహకరిస్తామన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో రేణుక ఎల్లమ్మ నాటకాన్ని కళాకారులు నిర్వహించారు. శుక్రవారం ఫౌండేషన్‌ సభ్యులు కళాకారులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాము, మల్లేశ్‌, శ్రీశైలం, విష్ణు, శ్రీను, ఫౌండేషన్‌ సభ్యులు రాఘవేందర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి



సోని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పంచాయతీ జూనియర్‌ కార్యదర్శులు

పంచాయతీ జూనియర్‌ కార్యదర్శుల డిమాండ్‌

మహేశ్వరం: ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను నెరవేర్చేందుకు చర్చలు జరపాలని పంచాయతీ జూనియర్‌ కార్యదర్శులు డిమాండ్‌ చేశారు. జేపీఎస్‌, ఓపీఎస్‌లు చేపడుతున్న సమ్మె శుక్రవారంతో 15 రోజులకు చేరుకున్నాయి. కందుకూరు డివిజన్‌ పరిధిలోని మహేశ్వరం, కందుకూరు, ఆమన్‌గల్‌, కడ్తాల్‌, తలకొండపల్లి మండలాలకు చెందిన పంచాయతీ జూనియర్‌ కార్యదర్శులు, ఔట్‌ సోర్సింగ్‌ కార్యదర్శులు మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడిన వరంగల్‌ జిల్లా ఖానాపూర్‌ మండలం రంగపూర్‌ పంచాయతీ జూనియర్‌ కార్యదర్శి సోని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్‌



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న రాంరెడ్డి

పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్‌: కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట గ్రామానికి చెందిన పార్టీ నాయకులు పలివెల రాజు గతేడాది మేలో ప్రమాదవశాత్తు మరణించారు. ఆయనకు కాంగ్రెస్‌ పార్టీ డిజిటల్‌ సభ్యత్వం ఉన్నందున పార్టీ నుంచి రాజీవ్‌ గాంధీ ప్రమాద బీమా రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మృతుడి భార్య లావణ్యకు శుక్రవారం రాంరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్‌ దండెం కృష్ణారెడ్డి, నాయకులు సౌండ్‌ శ్రీను, అబ్దుల్లాపూర్‌మెట్‌ మండల సేవాదళ్‌ చైర్మన్‌ కందుకూరి మల్లారెడ్డి, సువర్ణ, పెద్ద అంబర్‌పేట సేవాదళ్‌ చైర్మన్‌ రాంబాబు, మధు, రాజేశ్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం



చెక్కు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్‌

యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో బాయికాడి రాకేశ్‌(8) 2022 జనవరి 15న సంక్రాంతి సందర్భంగా గాలిపటం ఎగరేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామ ఎంపీటీసీ ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్‌ విద్యుత్‌ ప్రమాద విషయాన్ని విద్యుత్‌ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వారు రూ.5లక్షల పరిహారం మంజూరు చేశారు. ఈ చెక్కును శుక్రవారం ఎంపీటీసీ సభ్యుడు రాకేశ్‌ తల్లి వెంకటమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌ అధికారుల సహకారంతోనే రాకేశ్‌ కుటుంబ సభ్యులకు పరిహారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జంగయ్య, వెంకటయ్య, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి




నర్సరీ మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీఓ

ఎంపీఓ మధుసూదనాచారి

కడ్తాల్‌: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ మధుసూదనాచారి అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీని శుక్రవారం ఆయన సర్పంచ్‌ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలకు ఏర్పాటు చేసిన నీటి వసతులు, మొక్కలు ఎండిపోకుండా తీసుకున్న జాగ్రత్తల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో 10వేల మొక్కల చొప్పున 24 పంచాయతీల్లో మొత్తం 2.40లక్షల మొక్కలను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈజీఎస్‌ సిబ్బంది పర్యవేక్షణలో జూన్‌ నాటికి మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక ప్రకారం పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్‌ సిబ్బంది, కార్యదర్శి రాఘవేందర్‌, నాయకులు భిక్షపతి, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

క్రికెట్‌ బెట్టింగ్స్‌... ఇద్దరి అరెస్టు



నిందితులు

హస్తినాపురం క్రికెట్‌ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐపీఎల్‌ మ్యాచ్‌లకు సంబంధించి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసుల సంయుక్తంగా దాడిచేసి బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వనస్థలిపురం కమలానగర్‌కు చెందిన నీలపాల నరేష్‌యాదవ్‌(38), గౌతమీనగర్‌కు చెందిన అవనగంటి అంజయ్య(33)లను అరెస్ట్‌ చేశారు. రూ. 1.5 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని, సచిన్‌దిలీప్‌ దలియా అనే బుకీ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

మరో బెట్టింగ్‌ ముఠా ఆటకట్టు

చైతన్యపురి: క్రికెట్‌ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ సరూర్‌నగర్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు...షయనాజ్‌గంజ్‌ గ్యాన్‌బాగ్‌ కాలనీకి చెందిన శైలేందర్‌ అగర్వాల్‌(36) ఈవెంట్‌ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో సులువుగా డబ్బు సంపాదన కోసం శైలేందర్‌ క్రికెట్‌ బెట్టింగ్‌ ప్రారంభించాడు. సెల్‌ఫోన్‌, వాట్సాప్‌ ద్వారా డబ్బులు కలెక్ట్‌ చేస్తూ పంటర్లకు కమీషన్‌ ఇస్తున్నాడు.శైలేందర్‌తో పాటు సరూర్‌నగర్‌ సాయినగర్‌కు చెందిన ఉగ్గి శ్రీధర్‌ (38), వెంకటేశ్వర కాలనీకి చెందిన కనుకు గణేష్‌ (33)లు ఐపీఎల్‌ కేకేఆర్‌, ఆర్‌ఆర్‌ క్రికెట్‌ మ్యాచ్‌కు బెట్టింగ్‌ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, సరూర్‌నగర్‌ పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రహదారిపై మట్టికుప్పలు.. నిర్మాణ వ్యర్థాలు



రహదారి పక్కన డంప్‌ చేసిన నిర్మాణ వ్యర్థాలు

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు

చైతన్యపురి: రహదారుల మధ్యలో మట్టికుప్పలు, రోడ్డుపక్కన నిర్మాణ వ్యర్థాలు, సామగ్రి నెలల తరబడి అలాగే ఉన్నా... జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదు. గడ్డిఅన్నారం డివిజన్‌ లలితానగర్‌ కాలనీలో నెలకొన్న పరిస్థితి ఇదీ.

- ఇటీవలే కాలనీలో అందంగా సీసీ రోడ్డు వేశారు. అయితే, కొందరు రహదారిపై మట్టి, నిర్మాణ సామగ్రిని డంప్‌ చేయటంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- లోటస్‌ల్యాప్‌ స్కూల్‌ రహదారిలో రోడ్డు పక్కనే బిల్డింగ్‌ వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- బిల్డింగ్‌ వ్యర్థాలు రహదారుల పక్కన డంప్‌ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- ఇళ్ల నిర్మాణ సమయంలో కొందరు చెట్లను కొట్టివేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు.



లలితానగర్‌ కాలనీలో రహదారి పక్కన నిర్మాణ సామగ్రి

- కాలనీలో అధిక శాతం కమర్షియల్‌ దుకాణాలు ఉండటం వల్ల రహదారుల పక్కనే వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కు చేస్తున్నారని తద్వారా కాలనీలో రాకపోకలు సాగించడం కష్టంగా మారిందంటున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టికుప్పలు తొలగించాలని, నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను తొలగింప చేయాలని కోరుతున్నారు.



రహదారి మధ్యలో మట్టికుప్పలు